క్లుప్తంగా

ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గాంధీనగర్‌లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించారు. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు గాంధీనగర్‌లో మున్సిపల్ క్లస్టర్ నాయకులు, 18వవార్డు ఇన్‌చార్జ్ గుండా ఈశ్వరయ్య బీఎల్ఓలతో కలిసి ఇంటింటా ఓటర్ల జాబితాను పరిశీలన చేపట్టారు. ఓటర్ల జాబితాలో నిజమైన ఓటర్లు ఉన్నారా, అనర్హులు ఉన్నారా, మార్పులు, చేర్పులు తదితర వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గాజుల సోము, నాగిరెడ్డి, చంద్రశేఖర్, చంద్ర, లక్ష్మీకాంత్, రామంజి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా జీవన ప్రమాణపత్రాలు

కదిరి అర్బన్: ఏపీఎస్ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు, సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల భార్యలకు తన సొంత ఖర్చుతో జీవన ప్రమాణ పత్రాలు ఇవ్వనున్నట్లు రిటైర్డ్ డ్రైవర్ శ్రీరాములు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు కుటుంబ సభ్యులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అక్టోబర్ 10 నుంచి నవంబర్ 15 వరకు ఆర్టీసీ బస్టాండ్‌లోని ఫ్రెండ్స్ ఇంటర్‌నెట్ సెంటర్‌లో జీవన ప్రమాణ పత్రాలు చేసుకోవచ్చని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు హరిమోహన్, బాషా, గోపాలక్రిష్ణ పేర్కొన్నారు.

వైద్యుల సమ్మెతో బోసిపోయిన ఆస్పత్రి



ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీలో రోగులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

చెన్నేకొత్తపల్లి: వైద్యులు డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తుండడంతో రోగులకు లేక ఆసపత్రులు బోసిపోయాయి. నాగసముద్రం గేట్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రోగులు లేక ఆసుపత్రి బోసిపోయింది. రోజూ వందమందికి పైగా ఓపీ ఉండే ఆస్పత్రిలో వైద్యుడు లేక పోవడంతో రోగులు ఆస్పత్రి వైపు కన్నెత్తి చూడలేదు. మంగళవారం రోగులకు స్టాఫ్‌నర్స్ వైద్యం చేశారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన డాక్టర్లు

ముదిగుబ్బ: తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని ముదిగుబ్బ డాక్టర్లు రాజేంద్ర, శ్వేత తెలిపారు. మంగళవారం వారు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రధాన డిమాండ్ అయిన పీజీ ఇన్ సర్వీస్ కోటా పునరుద్ధరించాలన్నారు. టైం బౌండ్ ప్రమోషన్స్ తక్షణమే ప్రకటించాలన్నారు.

దుర్గామాతా నమోస్తుతే

సాక్షి బృందం: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో 9వ రోజు మంగళవారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఆలయాల్లో అమ్మవార్లను అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



బత్తలపల్లిలో దుర్గామాత రూపంలో అలంకరించిన అమ్మవారి విగ్రహం



ఖాద్రీ ఆలయంలో మోహిని అలంకారం



తలుపులలో మహిషాసుర మర్దిని అలంకారంలో వాసవీమాత



ధర్మవరం అర్బన్‌మహా గౌరీదేవిగా టీచర్స్‌కాలనీ చౌడేశ్వరిదేవి



ఎనుములపల్లిలో చండీ హోమం నిర్వహిస్తున్న రుత్వికులు



తగరకుంటలో దుర్గామాతగా భ్రమరాంబిక అమ్మవారు



నసనకోటలో పూజలందుకుంటున్న దుర్గాదేవి



దుర్గాదేవి అవతారంలో అమడగూరు చౌడేశ్వరి



ముదిగుబ్బలో దుర్గాదేవి అలంకరణలో వాసవీమాత

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గాండ్లపెంట: మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని వైద్య సిబ్బంది సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా 72 మందికి ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. శిబిరంలో సిహెచ్ఓ నాగేష్, హెచ్ఈఓ విజయ్ కుమార్, సూపర్‌వైజర్లు ఉపేంద్రారెడ్డి, విజయ కుమారి వైద్యశిబిరం ప్రాముఖ్యతను వివరించారు.



రోగులను పరీక్షిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు

రెండో రోజూ ఓపీ సేవల బహిష్కరణ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే వైద్యులు మంగళవారం రెండో రోజూ ఓపీ సేవలను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన అత్యవసర వైద్య సేవలు మినహా ఓపీని బహిష్కరించడంతో రోగులకు స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు కేవలం మందులను ఇచ్చి పంపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నల్లచెరువు: కొత్తకమ్మవారిపల్లి(మందాలవాండ్లపల్లి)కి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కలుపూరి వెంటేష్ నాయుడు(79) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ గ్రామానికెళ్లి వెంటేష్ మృతదేహంపై పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, వైస్ కన్వీనర్ రఫీ, మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఓరువాయి గ్రామ కన్వీనర్ పల్లె వెంకటరెడ్డి, ఎస్టీసెల్ నియోజక వర్గ కన్వీనర్ హైటెక్ రమణ, టీయూ నియోజక వర్గ కన్వీనర్ ఖాదర్‌వలి, ప్రధాన కార్యదర్శులు ఆదినారాయణ, లక్ష్మీపతి, సలీం, నల్లచెరువు గ్రామ కన్వీనర్ సూర్యశేఖర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు బషీర్, జావెద్, ఆనంద్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మోహన్, భాస్కర్ నాయుడు, రామాంజనేయులు, యల్లప్ప పాల్గొన్నారు.



వెంకటేష్‌నాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మక్బూల్ అహ్మద్

కక్షలకు దూరంగా ఉండండి

ముదిగుబ్బ: గ్రామాల్లో కక్షలకు దూరంగా ఉండి ప్రశాంత వాతావరణంలో జీవించాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ ప్రజలకు సూచించారు. మంగళవారం జొన్నలకొత్తపల్లిలో గ్రామస్తులతో కలిసి డీఎస్పీ, సీఐ శివరాముడు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మద్యం, జూదం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఫ్యాక్షన్ జోలికి వెళితే జీవితాలు నాశనమవుతాయన్నారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

కదిరి అర్బన్: కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు, అధికారుల వేధింపులకు గురవుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా, కార్యకర్తలకు అండగా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు సమన్వయకర్త ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలేదని దీన్ని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న తమ పార్టీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించడం సరి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇలాంటి బెదిరింపులకు భయపడరన్నారు. తమ పార్టీ సోషల్ మీడియా కార్యకర్త మెగా అంజాద్‌పై 18 తప్పుడు కేసులు వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశారన్నారు. అంజాద్ కుటుంబానికి తాను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. సోషల్ మీడియా కార్యకర్తలను తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం తమ కార్యకర్తలకు న్యాయం జరుగుతోందన్నారు. టీడీపీ నాయకుల మాట విని కార్యకర్తలను వేధించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో పొందుపరచాలన్నారు. తాము అధికారంలోకి రాగానే వారు సప్తసముద్రాల అవతల ఉన్నా తీసుకువచ్చి తగిన శిక్ష విధించేలా చూస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తామంతా కష్టపడి పనిచేసి పార్టీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డిని బాలకృష్ణ సైకో అని సంబోధించడం తప్పుగా కనపడలేదని, ఉన్నది ఉన్నట్లు (బాలకృష్ణకు మెంటల్ సర్టిఫికెట్) మాట్లాడిన వారిపై కేసు పెట్టారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాబ్జాన్ మాట్లాడుతూ లోకేష్ రెడ్‌బుక్ వైరస్‌కు యాంటీడోస్‌గా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారన్నారు. సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ట్విటర్ ఐడీలు స్ట్రాంగ్‌గా పెట్టుకోవాలన్నారు. అప్రమత్తంగా ఉండాలని తప్పుడు కేసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పార్టీ లీగల్ సెల్ వారికి అండగా ఉంటుందని లీగల్‌సెల్ అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరెడ్డి, మండల కన్వీనర్లు మణికంఠనాయక్, రవికుమార్‌రెడ్డి, రంగారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌యాదవ్, సోషల్‌మీడియా వాల్మీకి అంజితో పాటు అనుబంధ సంఘాల సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్దెత్తున హాజరయ్యారు.



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ తదితరులు

4న చిన్నకుళ్లాయిస్వామి ఉరుసు

ఎన్పీకుంట: వెలిచలమల గ్రామంలో వచ్చే 4న చిన్నకుళ్లాయిస్వామి ఉరుసు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 4వ తేదీ ఉదయం 9 గంటలకు పేటబావి వద్ద నుంచి వివిధ ప్రదర్శనలు, మేళతాళాలతో చిన్నకుళ్లాయిస్వామి పీరు మెరవణి ప్రారంభమవుతుందన్నారు. పానకం దుత్తలు, చెక్కభజనలు, కీలుగుర్రాలతో గంధం మెరవణి నిర్వహిస్తూ మధ్యాహ్నం 3 గంటలకు కుదుటకు చేరుతుందన్నారు. అదేరోజు రాత్రి 8 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆదివారం తెల్లవారుఝామున 3 గంటలకు స్వామి వారి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్లు వివరించారు. మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు. ఉరుసు రోజు ఉదయం 8 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.



చిన్నకుళ్లాయిస్వామి పీరు(ఫైల్)

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

నల్లచెరువు/ కదిరి అర్బన్: దేవిరెడ్డిపల్లి వద్ద నున్న ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు కదిరి యమహా షోరూంలో 10 రోజులపాటూ ఆటో మోటివ్ ఇంటర్న్‌షిప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు యమహా షోరూంలో మంగళవారం జీసీడీఓ సంపూర్ణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం శైలజ, దశరథ నాయక్, ఒకేషనల్ టీచర్లు సల్మా, లావణ్య, విజయ కుమార్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

యూత్ వింగ్ అధ్యక్షుడికి పరామర్శ



శేఖర్‌ను పరామర్శిస్తున్న వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి

బత్తలపల్లి: అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొట్టం శేఖర్‌ను మంగళవారం వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి పరామర్శించారు. దంపెట్ల గ్రామానికి చెందిన కొట్టం శేఖర్ సోమవారం ఉన్నఫలంగా బీపీ పెరిగడంతో వైద్యుల సూచనల మేరకు బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ ఆస్పత్రికి వెళ్లి శేఖర్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. శేఖర్‌కు ప్రస్తుతానికి ఆరోగ్యం నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయండి



చిన్నచిగుళ్లరేవు ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

బత్తలపల్లి: ఇసుక తరలింపులో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని ధర్మవరం ఆర్డీఓ మహేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం అర్ధరాత్రి మండలంలోని జ్వాలాపురం వద్ద ఏర్పాటు చేసిన ఇసుక చెక్‌పోస్టును పోలీసులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇసుక తరలించే వాహనాలను ఆపి సరైన బిల్లులు లేని వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం తాడిమర్రి మండలంలోని చిన్నచిగుళ్లరేవు ఇసుక రీచ్‌ను ఆకస్మికంగా తనిఖీలు జరిపి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లు, రెండు హిటాచీలను పట్టుకొని బత్తలపల్లి పోలీసులకు అప్పగించారు. సంబంధిత అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వే బిల్లులు, ఇసుక బిల్లులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

పొలాలకు దారి చూపండి

పుట్టపర్తి: తమ పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని సోమవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కోరినట్లు బుక్కపట్నం మండలం పాముదుర్తి గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ పాముదుర్తి గ్రామ కమిటీ అధ్యక్షురాలు బచ్చు సుజాత, నారాయణస్వామి, దివాకర్, లక్ష్మీనారాయణ, నరసింహుడు తదతరులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన దివాకర్‌రెడ్డితో తాము గతంలో భూమి కొనుగోలు చేశామని, అనేక ఏళ్ల నుంచి పొలాలకు రాకపోకల సాగించేవాళ్లమన్నారు. అయితే ఇటీవల సదరు రైతు పొలాలకు వెళ్లకుండా దారికి అడ్డంగా ముళ్లకంచె ఏర్పాటు చేయడంతోపాటు గుంతలు తవ్వారన్నారు. ఈ ఘటనలో గ్రామానికి చెందిన ఇంద్రజిత్‌రెడ్డి ప్రోద్బలం ఉందని, తమకు దారి ఏర్పాటు చేయాలని కోరినట్లు వివరించారు.

సంక్షిప్త సమాచారం

వార్డుల పునర్విభజనపై అభ్యంతరాల సేకరణ

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పురపాలకసంఘం వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు కమిషనర్ క్రాంతికుమార్ మంగళవారం తెలిపారు. నగర పంచాయతీగా ఉన్న పుట్టపర్తిని గత ప్రభుత్వం గ్రేడ్-2 మున్సిపాలిటీలో మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రేడ్ పెంచిన మున్సిపాలిటీలకు వార్డు పెంచేలా ఇటీవల ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. అందులో భాగంగా పుట్టపర్తి నగర పంచాయతీగా ఉన్నప్పుడు 20 వార్డులు ఉన్నాయని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 27 వార్డులకు పెంచుతున్నట్లు తెలిపారు. ప్రజల సూచనలు, సలహాల కోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులో ఉంచుతున్నట్లు తెలిపారు. అభ్యంతరాలు, సూచనలను 7రోజుల లోపు తెలియజేయాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలి

కదిరి అర్బన్: సుప్రీంకోర్టు ఇన్‌సర్వీస్‌లో ఉండే ఉపాధ్యాయులందరూ టెట్ పరీక్ష రాయాలని తీర్పు వెలువరించిన నేపథ్యంలో దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహీర్‌వలీ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓ 51 విడుదల చేసిన జీవోలో ఎక్కడా ఇన్‌సర్వీస్‌లో ఉండే ఉపాధ్యాయులు టెట్ రాయాలని సూచించలేదని పేర్కొన్నారు.

చోరీపై ఫిర్యాదు

తలుపుల: మండల కేంద్రం సమీపంలోని జగనన్న కాలనీలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 3 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ చేశారు. దీనిపై మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ శివతేజ ఏఎస్ఐ గుర్రప్పకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ కేబుల్ చోరీ

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం గూనిపల్లిలో 12 మంది రైతుల బోరుబావుల వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై మంగళవారం బుక్కపట్నం పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురండి

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. మంగళవారం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి కామిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి లో గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న విషయాలకే గొడవలు పడి కేసులు, కోర్టులు అంటూ జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు.

రామగిరివాసికి డాక్టరేట్

రామగిరి: మండలంలోని పెనుబోలుకు చెందిన బాలకొండ గంగాధర్ చరిత్రశాఖలో పీహెచ్‌డీ పట్టాను సోమవారం తెలంగాణా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా అందుకున్నారు. గంగాధర్ వైఎస్సార్ జిల్లా వేంపల్లె డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, వరాహగిరి వెంకటగిరి, నీలం సంజీవరెడ్డిపై విమర్శనాత్మక విశ్లేషణపై ఆచార్య సుధారాణి పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తిచేశారు. ఇందుకు ఆయన డాక్టరేట్ అందుకున్నారు.



గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న గంగాధర్